క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం



మంగళగిరి: నగరంలోని పార్కురోడ్డు యాదవపాలెంలో గురువారం పోలేరమ్మ అమ్మవారు, పోతురాజు స్వామి వార్ల విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రశాంతి హోమం, గోమాత పూజలు జరిపారు. పురోహితులు టి.శ్యామసుందర శాస్త్రి శిష్య బృందం ఆధ్వర్యంలో పునఃప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా అఖిలాండేశ్వరి దేవస్థాన వార్షికోత్సవం



మంగళగిరి: నగరంలోని స్టేషన్‌రోడ్డులో వేంచేసి ఉన్న అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థాన 15వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లలితా సహస్రనామ పూజ, పంచామృతాభిషేకం జరిపారు. దేవస్థాన చైర్మన్ సుబ్బారావు, వసంత దంపతులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శాంతిపేట కాలనీలోని ఎంపీపీ పాఠశాల సమీపంలో రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ గురువారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రోడ్డుపై మురుగునిలిచి రాకపోకలకు కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఆ నిధుల్లో ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ.6 లక్షలు కేటాయించారని చెప్పారు. కార్యక్రమంలో టి.డేవిడ్, పి.జోసఫ్, డి.హృదయరాజు, టి.మరియదాసు, టి.సాగర్, లూర్దురాజు పాల్గొన్నారు.

శరవేగంగా బీటీ రోడ్డు నిర్మాణం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామం నుంచి పేరుకలపూడి వరకు బీటీ రోడ్డు నిర్మాణాన్ని గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టారు. ఈమని నుంచి పేరుకలపూడి వరకు కోటి 27 లక్షల రూపాయల వ్యయంతో 3.9 కిలోమీటర్లు, 3.75 మీటర్ల వెడల్పుతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ తెనాలి డివిజన్ డీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఈ పనులను ఏఈ నరసింహారావు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు.

ఎందరో వీరుల త్యాగఫలం స్వాతంత్ర్యం

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్ కుమార్



తాడికొండ: ఎందరో వీరుల త్యాగఫలమే స్వాతంత్ర్యం అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరులోని భారత్‌పేట నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి సందేశం అందించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మంగళగిరి: యర్రబాలేనికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు యర్రబాలెం బండివారి వీధికి చెందిన ఉయ్యాల బాబూరావు అనే 40 సంవత్సరాల వ్యక్తి చిన్నతనం నుంచి మానసిక ఎదుగుదల లేక బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు బాబూరావును ఎంతో గారాబంగా పెంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పక్కనే ఉన్న పెనుమాకకు చేరి దండోరా కళాకారుడు మైఖేల్ వెంట వీధుల్లో తిరిగాడు. గమనించిన మైఖేల్ బాబూరావును పెనుమాక సెంటర్‌లో ఆటో ఎక్కించి యర్రబాలెంలో దించాలని ఆటో డ్రైవర్‌ను కోరాడు. అయితే బాబూరావు ఇంటికి చేరుకోవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. బాబూరావు మంగళగిరి, తాడేపల్లి పరిసర ప్రాంతాల్లోనే ఉండవచ్చని, ఆచూకీ తెలిసిన వారు 97055 25110 సెల్ నంబరుకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్



కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీఈ కృష్ణారెడ్డి



కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఆర్‌ఐ సాంబశివరావు



కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కమిషనర్ శారదాదేవి

మహనీయుల త్యాగాలు మరువలేనివి

- వారి స్ఫూర్తితో అభివృద్ధికి పునరంకితమవుదాం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: మహనీయుల త్యాగాలు మరువలేనివని, వారిని స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధికి పునరంకితమవుదామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత జాతీయ జెండాను నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి ఆవిష్కరించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు దుశ్శాలువాలు కప్పి మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, పట్టణ, రూరల్, సర్కిల్ పోలీస్ స్టేషన్లలో సీఐ బి.అంకమ్మరావు, రూరల్ ఎస్‌ఐ టి.రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ రైటర్ కోటేశ్వరరావు, హెడ్ పోస్టాఫీస్‌లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ బి.శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో మంగళగిరి సబ్‌బ్రాంచ్ అధ్యక్షుడు, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, శాఖా గ్రంథాలయంలో పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్, మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీమ్, యర్రబాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ రాజేష్, గణపతి నగర్ యూపీహెచ్‌సీలో డాక్టర్ పి.అనూష మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

మేడికొండూరు: విశదల సచివాలయంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వప్న రాజేష్, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, ఎంపీడీవో శోభారాణి, తహసీల్దారు జి.కరుణ కుమార్, మామిడి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని సచివాలయాల వద్ద, ఫిరంగిపురంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పద్మనాభుడు జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో డి.అనూరాధ జెండాను ఆవిష్కరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి, శాంతిపేట మండల పరిషత్ పాఠశాల వద్ద జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, బేతపూడిలోని సచివాలయం వద్ద సర్పంచ్ గంధూళి ఆదంబీ, యర్రగుంట్లపాడు సచివాలయం వద్ద ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, మేరికపూడి సచివాలయం వద్ద సర్పంచ్ పూసపాటి నాగమల్లేశ్వరి, తక్కెళ్లపాడు సచివాలయం వద్ద వైస్ ఎంపీపీ మార్పుల విజయలక్ష్మీ, వేములూరిపాడు సచివాలయం వద్ద కె.చిన్న, ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మేడా బాబు, రేపూడి సచివాలయం వద్ద సర్పంచ్ చిట్టా అంజనీదేవిలు జాతీయ జెండాను ఎగురవేశారు.

తాడేపల్లిలో..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలంలో గణతంత్ర వేడుకలను వైభవంగా నిర్వహించారు. తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం వద్ద డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు జెండా వందనం నిర్వహించారు. తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ రామ్‌ప్రసాద్ జెండా ఎగురవేశారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ సాంబశివరావు జెండా వందనం చేసి చాక్లెట్లు, కేకులు పంపిణీ చేశారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో గాంధీ విగ్రహానికి హెచ్‌ఎం లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి) పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా వందనం చేశారు. దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లేశ్వరి జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, ఎంఈవో శ్రీనివాసరావు జెండా వందనం చేశారు. ఈమని గ్రామంలో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ జాతీయ జెండాను ఎగురవేశారు. దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలలు సంయుక్తంగా గణతంత్ర వేడుకలను నిర్వహించాయి. ప్రవాస భారతీయుడు జంపాల సుబ్బారావు జెండా ఆవిష్కరణ చేశారు.

సీతానగరం పీడబ్ల్యూడీ వర్క్‌షాప్‌లో..

సీతానగరం పీడబ్ల్యూడీ వర్క్‌షాప్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జాహ్నవి జెండా వందనం చేశారు.

కేఎల్‌యూలో..

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌సీసీ విద్యార్థులు పరేడ్ నిర్వహించారు. అనంతరం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ బి.మౌనిక, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ హరికిషోర్, శాప్ అసోసియేట్ డీన్ రూతు రమ్య తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా గణతంత్ర వేడుకలు

తాడికొండ: వాడవాడలా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయపూడి విద్యుత్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎస్ఈ పి.విజయ్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తాడికొండ తహసీల్దార్ కార్యాలయం, తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ వి.అంకినీడుప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

చేనేత సొసైటీ ఆధ్వర్యంలో..

మంగళగిరి: నగరంలోని వీవర్స్ కాలనీ దామర్ల రమాకాంతరావు విగ్రహం వద్ద చేనేత సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. నగరంలోని కోర్టుల ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి శేషయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్‌లో..

మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్‌లో జరిగిన కార్యక్రమంలో కమాండెంట్ కేఎస్‌వీ సుబ్బారెడ్డి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. చినకాకాని ఎన్నారై వైద్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు.



హెడ్ పోస్టాఫీస్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ బి శ్రీనివాసరావు



యర్రబాలెంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజేష్



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి



యర్రగుంట్లపాడులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కత్తిరేణమ్మ, పక్కన ఎంపీపీ షహేలానర్గీస్



తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో జెండా వందనం



రాయపూడి విద్యుత్ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఎస్ఈ పి.విజయ్ కుమార్



జెండా వందనం నిర్వహిస్తున్న కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ



తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

మంగళగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- పలు అభివృద్ధి పనుల పరిశీలన

మంగళగిరి: నగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి పరిశీలించారు. కొండపై గండాలయపేట స్వామి ఆవరణలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో దాతల సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం నగరంలోని పెద్ద కోనేరు (కళ్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులను పరిశీలించి దేవదాయ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.



వైఎస్సార్ చేనేత బజారు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెదకోనేరు (కళ్యాణ పుష్కరిణి) అభివృద్ధికి ఇప్పటికే శ్రీకారం చుట్టామని, రానున్న బ్రహ్మోత్సవాల నాటికి పనులను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం పాత మంగళగిరి భావనారుషి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ప్రగడ కోటయ్య ప్రాంగణంలోని వైఎస్సార్ చేనేత బజార్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం నగరంలోని ఆటోనగర్‌లో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, బేతపూడి నర్సయ్య, దేవతి భగవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లతో చేరువైన వైద్య సేవలు

మేడికొండూరు: వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో వైద్య సేవలు గ్రామీణులకు మరింత చేరువయ్యాయని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. గురువారం విశదల గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ వెల్‌నెస్ క్లినిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా పది కిలోమీటర్ల దూరంలో ఉండే పీహెచ్‌సీకి వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం 1,032 విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు, 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 65 రకాల మందులతో పాటు, 67 రకాల ఎక్యూప్‌మెంట్ అందుబాటులో ఉంటుందన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా విలేజ్ క్లినిక్‌లకు పక్కా భవనాల నిర్మాణం, మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.1.69 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. విలేజ్ క్లినిక్ నుంచి టెలిమెడిసిన్ సైతం అందుబాటులో ఉంటాయన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, మామిడి సీతారామయ్య, ఎంపీడీవో శోభారాణి, తహసీల్దారు కరుణకుమార్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్: 16వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ వారధి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. సీఐ సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో కనకదుర్గ వారధి 31వ కానా వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. మృతుడ్ని గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడు బ్రౌన్ కలర్ జర్కిన్, నలుపు, తెలుపు, ఎరుపు డిజైన్‌తో చొక్కా, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మరణించిన వ్యక్తి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉండవచ్చు. తెలుపుగడ్డం, ఎరుపు రంగు శరీరం కలిగి ఉన్నాడు. ఎవరైనా ఈ మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడిగా ఎస్‌కే హుస్సేన్

మంగళగిరి: ఏపీ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడుగా కొత్తపేటకు చెందిన ఎస్‌కే హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హుస్సేన్‌కు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఉపాధ్యక్షుడుగా షేక్ జాకీర్ హుస్సేన్, పట్టణ జాయింట్ సెక్రటరీలుగా బాపనపల్లి దుర్గాప్రసాద్, అవ్వారు సుబ్బారావు, కలకోటి రాజేష్‌ను నియమించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్నం నాగబాబు, జిల్లా కో–ఆర్డినేటర్ కాగితాల స్వాతిగౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వాకా మాధవరావు, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ఆలా శివాజీ, పట్టణ గౌరవ అధ్యక్షురాలు గోలి కస్తూరి తదితరులు పాల్గొన్నారు.



నియామకపు పత్రాలను అందుకున్న వారితో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్

రూ.1.46 లక్షల సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మంగళగిరి: దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన షేక్ షహనావాజ్ అనే బాలునికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1.46 లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి బాలుని తండ్రి రఫీ దరఖాస్తు చేసుకోగా మంజూరు చేయించడం జరిగిందన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

మంగళగిరి: విద్యార్థులు చదువుల ద్వారా మంచి జ్ఞానాన్ని సంపాదించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. అధ్యయనం, అవగాహన, ఆచరణ అనే మూడు అంశాలు విద్యార్థులకు ప్రధానమైనవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలకు న్యాయమూర్తి వెంకటేశ్వర్లు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని

ఏపీఎస్పీ పోలీస్ సిబ్బందికి పురస్కారాలు

మంగళగిరి: నగరంలోని ఆరవ ఏపీఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలస్వామి, హెడ్ కానిస్టేబుల్ డి.వరప్రసాద్‌లకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవల అవార్డుతో పాటు రూ.20 వేల నగదు బహుమతులు అందుకున్నారు. ఏపీఎస్పీ అడిషనల్ డీజీపీ శంక బ్రతబాగ్చీ చేతుల మీదుగా పురస్కారం పొందారు.





పురస్కారాలు అందుకుంటున్న అసిస్టెంట్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలస్వామి, హెడ్‌కానిస్టేబుల్ డి.వరప్రసాద్

కొలనుకొండ శ్మశానవాటికలో గ్రావెల్ ఫిల్లింగ్

తాడేపల్లిరూరల్: కొలనుకొండ క్రిస్టియన్ శ్మశానవాటికలో గురువారం గ్రావెల్ ఫిల్లింగ్ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే ఆ ప్రాంతంలో పర్యటించిన సమయంలో క్రిస్టియన్ శ్మశానవాటిక లోతట్టు ప్రాంతంలో ఉండటంతో అంత్యక్రియల సమయంలో నీళ్లు నిలిచి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదన సిద్ధం చేసి గ్రావెల్ ఫిల్లింగ్ చేయాలని ఆదేశించారు. డీఈ కృష్ణారెడ్డి రూ.9 లక్షల వ్యయంతో మూడు అడుగుల ఎత్తున గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కొలనుకొండ సచివాలయ సిబ్బంది క్రాంతి పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు లెవలింగ్ చేస్తూ పనులు నిర్వహిస్తున్నారు.